క్లుప్తంగా

సీఎం వైఎస్‌ జగన్‌ నిర్ణయంపై హర్షం

తాడేపల్లిరూరల్: రానున్న రాజ్యసభ ఎన్నికల్లో ముస్లింలను రాజ్యసభకు పంపుతానని ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి ప్రకటించడం హర్షణీయమని వైఎస్సార్‌ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్‌ సుభాని అన్నారు. శనివారం దుగ్గిరాలలోని ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌ను రాజ్యసభకు పంపుతాననడం ముస్లింల సంక్షేమంపై చిత్తశుద్ధి మరోసారి రుజువైందన్నారు.

ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలి



ఫిరంగిపురం: ప్రజాస్వామ్యం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా వినియోగించుకోవాలని స్వీప్‌ నోడల్‌ అధికారి కె.వి. సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలో ఓటర్లను చైతన్య పరిచేందుకు ఇంటింటికి తిరిగి ప్రజలకు ఓటు విలువను గురించి వివరించారు. గ్రామసెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ఓటు ఆవశ్యకతను తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్‌ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ ఎన్నికల సమయంలో వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ జి.రాఘవేంద్రరావు, డీటీ రాజారమేష్‌, ఆర్‌ఐ దీప పాల్గొన్నారు.

బార్‌ అసోసియేషన్‌ కార్యవర్గానికి సత్కారం



మంగళగిరి: బార్‌ అసోసియేషన్‌ నూతన కార్యవర్గాన్ని ఆటోనగర్‌లోని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) కార్యాలయంలో శనివారం సన్మానించారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో వైఎస్సార్‌ సీపీకి అండగా నిలిచి, మురుగుడు లావణ్య విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్‌ అధ్యక్షుడు శృంగారపాటి బాల మురళీకృష్ణ,ఉపాధ్యక్షుడు కుదారి శేఖర్‌బాబు, ప్రధాన కార్యదర్శులు మాలపాటి సురేంద్ర బాబు, తాతా సాంబశివరావు, ప్రతినిధులు తోట చంద్రశేఖర్‌, సూరబోయిన మురళీకృష్ణ, స్వరూపారాణి పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు



తాడేపల్లిరూరల్: భర్త కనిపించడం లేదంటూ భార్య శనివారం ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ రమేష్‌ అందించిన వివరాలు.. తాడేపల్లి పట్టణ పరిధిలోని నెహ్రూ బొమ్మ సెంటర్‌కు చెందిన బుర్రముక్కు సాంబిరెడ్డి(50) మార్చి 8వ తేదీ ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి ఇంత వరకు ఇంటికి రాలేదని భార్య అనూరాధ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బంధువుల దగ్గర, తెలిసిన వాళ్లను విచారణ చేసినా ఎటువంటి ప్రయోజనం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు. ఆచూకీ తెలిసిన వారు 08645 272186కు సమాచారం ఇవ్వాలని కోరారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ప్రకటించాలి

మంగళగిరి: దళిత జనబాంధవుడు, స్వాతంత్ర్య సమరయోధులు బాబూ జగ్జీవన్‌రామ్‌ జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ప్రకటించాలని వైఎస్సార్‌ సీపీ ఎస్సీ విభాగం నాయకులు డిమాండ్‌ చేశారు. పట్టణంలోని ఐబీఎస్‌ భవన్‌ ప్రెస్‌ క్లబ్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశం మాట్లాడారు. దళిత, బడుగు, బలహీనవర్గాల కొరకు నిరంతరం కృషి చేసి దేశానికి అనేక సేవలందించిన జగ్జీవన్‌రామ్‌ జయంతి ఏప్రిల్‌ 5వ తేదీన జరుపుకుంటున్న నేపథ్యంలో భారతరత్న ప్రకటించాలని కోరారు. సమావేశంలో ఎస్సీ విభాగం నాయకులు ఈపూరి ఆదామ్‌, శావలి థామస్‌, ముదిగొండ ప్రకాష్‌, విక్టరీ ఇమ్మానియేలు, డి.శ్రీకాంత్‌, బి.కిషోర్‌, వి.రజనీకాంత్‌, ఇ.రమేష్‌, పి.శామ్యూల్‌, పులివర్తి రాంబాబు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

తాడికొండ: గడ్డి మందు తాగి యువకుడు మృతి చెందిన ఘటన తుళ్లూరు మండలం మోదుగలంకపాలెంలో చోటుచేసుకుంది. సీఐ సుభాని తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మధిర వెంకటసాయి(17) మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతితో ప్రేమలో ఉన్నాడు. విషయం యువతి బంధువులకు తెలియడంతో వెంకటసాయి ఇంటికి వచ్చి బెదిరించారు. దీంతో భయాందోళనకు గురైన యువకుడు గురువారం గడ్డి మందు తాగాడు. విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. మృతిని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీసీలపై లోకేష్‌ దాడులు చేయించడం సిగ్గుచేటు

- జీసీ మహిళలు పోటీ చేయకూడదా
- నిలదీసిన వైఎస్సార్‌ సీపీ అభ్యర్థి లావణ్య
- లావణ్యను సాదరంగా ఆహ్వానించి సత్కరించిన మైనార్టీ మహిళలు



13వ వార్డులో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య. ఆమె వెంట ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల తదితరులు

మంగళగిరి: మళ్లీ నారా లోకేష్‌కు ఓటమి తప్పదని వైఎస్సార్‌ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య ధ్వజమెత్తారు. పట్టణంలోని 12,13 వ వార్డులలో లావణ్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, సీనియర్‌ మైనార్టీ నాయకులు ఎండీ ఇక్బాల్‌ అహ్మద్‌ ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌ సీపీని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ 2019 ఎన్నికలలో చావుదెబ్బతిన్న లోకేష్‌ రానున్న ఎన్నికలలోను ఓటమి తప్పదని ముందే గ్రహించి హింసాత్మక ఘటనలతో కుట్రలకు తెరదీసి గెలవాలని చూడడం సిగ్గుచేటని పేర్కొన్నారు. బీసీ చేనేత వర్గానికి చెందిన మహిళ పోటీ చేస్తే దాడులకు తెగబడతారా అని ప్రశ్నించారు.

తమ ప్రచార వాహనాన్ని అడ్డుకుని ఫ్లెక్సీలు చింపి డ్రైవరును కొడితే లోకేష్‌ గెలవలేడని, ప్రజల అభిమానం సంపాదించుకుని గెలవాలని హితవు పలికారు. మంగళగిరి నియోజకవర్గంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బడుగు బలహీనవర్గాలంతా తమకు అండగా నిలిచి తమను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఇప్పటికైనా టీడీపీ నాయకులు, లోకేష్‌ తమ బుద్ధి మార్చుకుని నియోజకవర్గంలో ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని లేదంటే తమ సత్తా ఏమిటో చూపించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆప్కో మాజీ చైర్మన్‌ చిల్లపల్లి మోహనరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్‌, పట్టణ జేసీఎస్‌ కన్వీనర్‌ ఎండీ ఫిరోజ్‌, మహిళా కార్యదర్శి మల్లవరపు సుధారాణి, నాయకులు సయ్యద్‌ అక్బర్‌ ఆలి, సయ్యద్‌ బాబు, ఎస్‌కే అన్వర్‌, రాచకొండ వెంకటేశ్వరరావు, బిజిలి, ఎస్‌కే సుభాని, ఆరిపుల్లా, బేతపూడి నరసయ్య, సాలి ప్రశాంత్‌, వనమా గీతాదేవి, అష్రఫ్‌ ఖాన్‌(అశోక్‌), సద్దాం హుస్సేన్‌, తాడిబోయిన సుబ్బారావు, దీపాల కుమార్‌ పాల్గొన్నారు.

నారా లోకేష్‌కు ఓటమి తప్పదు



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌ సీపీ చేనేత విభాగం అధ్యక్షుడు మల్లేశ్వరరావు

మంగళగిరి నియోజకవర్గంలో నారా లోకేష్‌కు రెండోసారి ఘోరపరాజయం తప్పదని వైఎస్సార్‌ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్‌, మహిళా నాయకురాలు సంకె సునీత పేర్కొన్నారు. స్థానిక ఆటోనగర్‌లోని ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఒక సారి ఎమ్మెల్యే ఆర్కే చేతిలో ఓటమి చవి చూసిన లోకేష్‌, రానున్న చేనేత సామాజిక వర్గానికి చెందిన మహిళ చేతిలో పరాభవం తప్పదని గ్రహించి ఘర్షణ వాతావరణం సృష్టించి ఎలాగైనా గెలవాలనే టీడీపీ కార్యకర్తలతో దాడులను ప్రోత్సహిస్తున్నారని ఎద్దేవా చేశారు. దాడులు చేస్తే బీసీలు భయపడతారనుకోవడం లోకేష్‌ భ్రమ అని బీసీలంతా ఏకమై బీసీ మహిళను గెలిపించుకుంటారని గుర్తించుకోవాలన్నారు. మరలా ఇలాంటి ఘటనలు పునరావృత్తమైతే బీసీల సత్తా ఏమిటో చూపితే లోకేష్‌ మంగళగిరిలో అడుగు పెట్టలేరని హెచ్చరించారు.

డ్రైవర్లు అంటే చంద్రబాబుకు అంత చులకనా!

మంగళగిరి: వైఎస్సార్‌ సీపీ శింగనమల అసెంబ్లీ అభ్యర్థిగా సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఒక డ్రైవరును ఎంపికపై మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, డ్రైవర్లును ఎగతాళి చేస్తూ మాట్లాడారు. దీనిపై డ్రైవర్లతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్రైవర్లు, అభివృద్ధిలో భాగస్వాములు కదా అని ప్రశ్నిస్తున్నారు. పేదలను ప్రోత్సహించడంతో పాటు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి పేదలంతా అండగా నిలుస్తారని స్పష్టం చేస్తున్నారు.

ఎన్నికల్లో పోటీచేస్తే తప్పేంటి!



చంద్రబాబు పేదలను ఎప్పుడు ఓటు బ్యాంకుగానే చూస్తారు. ఎన్నికల సమయంలో ఓట్లు వేయించుకుని తర్వాత వదిలేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. ఉన్నత విద్యావంతుడైన వైఎస్సార్‌ సీపీ శింగనమల అభ్యర్థి డ్రైవరు అయినా సీఎం జగనన్న పేదలు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో సీటు ఇస్తే తప్పేంటి.

–బత్తుల వీరయ్య, టిప్పర్‌ డ్రైవర్‌ మంగళగిరి

అవమానించడం దారుణం



చంద్రబాబు డ్రైవర్లును అవమానించడం దారుణం. పేదలు చట్టసభలలో అడుగుపెట్టి వారి అభివృద్ధికి పాటు పడలానే ఆలోచనతో సీఎం జగనన్న పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బడుగు బలహీనవర్గాలు, డ్రైవర్లుకు సీటు కేటాయిస్తే వారికి ఎగతాళి చేసి మాట్లాడిన చంద్రబాబుకు రాజకీయ సమాధి కడతారని గుర్తించుకోవాలి.

–ఇమ్మానుయేలు, లారీ డ్రైవర్‌, మంగళగిరి

పేదలంటే అలుసు



పేదలన్నా కూలీలు, డ్రైవర్లు అన్నా చంద్రబాబుకు చులకన భావన. డ్రైవర్లు పేదలు చట్టసభలలోకి రాకూడదనే ఆలోచనతోనే చంద్రబాబు కోటీశ్వరులకు టికెట్లు ఇచ్చి పేదలను ఓడించేందుకు కుట్రలు చేస్తున్నారు. పెత్తందారులకు పేదలకు జరుగుతున్న రానున్న ఎన్నికల సమరంలో పేదల సత్తా ఏమిటో చంద్రబాబుకి తెలిసి వచ్చేలా చేస్తాం.

–వెంకటేశ్వరరావు, డ్రైవర్‌, మంగళగిరి

అసెంబ్లీకి వెళ్లే అర్హత లేదా!



డ్రైవర్లుకు అసెంబ్లీకి వెళ్లే అర్హత లేదన్నట్లుగా చంద్రబాబు మాట్లాడి తన పెత్తందారి తనాన్ని మరోసారి చాటుకున్నాడు. పేద బడుగు, బలహీనవర్గాలు డ్రైవర్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సత్తా ఏమిటో పెత్తందారులకు రానున్న ఎన్నికలలో చూపించి చంద్రబాబుకు బుద్ధి చెబుతాం.

– షేక్‌ అబిద్‌ లారీ డ్రైవర్‌ మంగళగిరి

ఎన్నికల కోడ్‌ అమలులో అలసత్వం వద్దు

రిటర్నింగ్‌ అధికారి గంగరాజు



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి గంగరాజు

తాడికొండ: ఎన్నికల కోడ్‌ అమలులో అధికారులు అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి ఎం.గంగరాజు హెచ్చరించారు. తుళ్లూరు మండల అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్‌ ఆదేశాల మేరకు అన్ని పార్టీల అభ్యర్థులపై డేగకన్ను వేసి పర్యవేక్షించాలని తెలిపారు. పార్టీ కార్యాలయాలు, ఇతర ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై నివేదికను సమర్పించిన తరువాత తుది నిర్ణయాధికారం జిల్లా కలెక్టర్‌దే కనుక ఎన్నికల కోడ్‌కు సంబంధించిన అంశాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదించాలని కోరారు. ఎన్నికల్లో నిలబడే అభ్యర్థులు ఎన్నికల నిమిత్తం పది వాహనాలు మాత్రమే ఉపయోగించుకోవాలని చెప్పారు. ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సిబ్బంది అంతా సమష్టిగా పనిచేసి అందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అధికారులదే అన్నారు. కోడ్‌ ఆఫ్‌ కండక్ట్‌ అమలులో భాగంగా ప్రచారానికి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని, సువిధ యాప్‌ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. నామినేషన్లు వేసే వరకు అభ్యర్థులు చేసే ఖర్చు పార్టీ ఖాతాల్లోకి వెళుతుందని, నామినేషన్లు వేసిన అనంతరం అభ్యర్థుల సొంత ఖాతాలోకి వెళుతుంది కనుక ప్రతి వ్యయాన్ని అనుమతులు తీసుకొని ఖర్చు చేయాలన్నారు. కార్యక్రమంలో తుళ్లూరు డీఎస్పీ అశోక్‌ గౌడ్‌, ఎంపీడీఓ బి.శివన్నారాయణ, ఈఓపీఆర్డీ నాగానంత్‌, సీఐ అనూరాధ పాల్గొన్నారు.

ఓటమి తప్పదనే లోకేష్‌ దాడులు చేయిస్తున్నాడు



మంగళగిరి: 2019 ఎన్నికలలో మంగళగిరి నియోజకవర్గంలో తన చేతిలో ఘోరంగా ఓటమి పాలైన నారా లోకేష్‌ 2024లోనూ చేనేత సామాజిక వర్గానికి చెందిన మహిళ చేతిలో ఓటమి తప్పదని గ్రహించి ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్నాడని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) మండిపడ్డారు. శనివారం వైఎస్సార్‌ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆర్కే తమ అభ్యర్థి ప్రచార వాహనాన్ని అడ్డుకుని ఫ్లెక్సీలు చించి డ్రైవర్‌పై టీడీపీ గూండాలు చేసిన దాడిని తీవ్రంగా ఖండించారు. సమసమాజం కోసం మంగళగిరి టికెట్‌ను సీఎం జగనన్న పద్మశాలీ బీసీ మహిళ అయిన లావణ్యకు కేటాయిస్తే మహిళ చేతిలో ఓటమి ఖాయమని తెలుసుకున్న లోకేష్‌ అరాచకాలకు తెరతీస్తున్నారని ధ్వజమెత్తారు. బీసీలపై దాడులు చేస్తే ఊరుకుంటారని అనుకోవద్దని తాను తలచుకుంటే నీవు.. నీవు అమెరికా నుంచి దిగుమతి చేసుకున్న 'పెమ్మసాని'లు మంగళగిరిలో అడుగు పెట్టలేరని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. మంగళగిరి నియోజకవర్గం ప్రశాంతతకు మారుపేరని అలాంటి నియోజకవర్గంలో తాము ప్రశాంతంగా ఎన్నికలు జరగాలని కోరుకుంటున్నామని, మరో సారి ఇలాంటి ఘటనలు పునరావృత్తమైతే సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

జగనన్న పాలన మెచ్చి..



ఫిరంగిపురంలో ఎమ్మెల్యే సుచరిత సమక్షంలో వైఎస్సార్‌ సీపీలో చేరిన అనంతవరానికి చెందిన టీడీపీ కార్యకర్తలు

ఎమ్మెల్యే సుచరిత సమక్షంలో వైఎస్సార్‌ సీపీలో చేరిక

ఫిరంగిపురం: పేదల పాలిట వరం నవరత్నాల పథకాలు అని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త మేకతోటి సుచరిత పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రకాశం పంతులు నగర్‌, రేపూడి, రేపూడి కాలనీల్లో శనివారం సాయంత్రం ప్రజలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటి తిరిగి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు డి.కత్తిరేణమ్మ, సర్పంచి చిట్టా అంజనీదేవి, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు నన్నం సునీత, కె.చిన్నప్పరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, జి.చంద్రం, డి.మెల్కియా, డి.సురేష్‌, పాలపాటి రఘు, బి.శ్రీనివాసరెడ్డి, మేడాబాబు, బి.అంజిరెడ్డి, వి.రాము, జె.ఏడుకొండలు, జి.నాగమల్లేశ్వరి, చిట్టా సీతారెడ్డి, దినేష్‌రెడ్డి, వాసు, ప్రతాప్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, టి.డేవిడ్‌, సత్యం, జే శ్రీను, అంజి, హేమలతారెడ్డి, ఐలా సుధాకరరెడ్డి, బి. బ్రహ్మారెడ్డి, ఖాజావలి, ప్రకాష్‌రావు, రంజన్‌బాబు, పి.అయ్యప్ప, పి.చిన్న, టి.కృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

అనంతవరం నుంచి..

తుళ్లూరు మండలం అనంతవరం గ్రామం నాయకుల కాలనీకి చెందిన 20 మంది టీడీపీ కార్యకర్తలు ఫిరంగిపురంలో ఎమ్మెల్యే మేకతోటి సుచరిత సమక్షంలో వైఎస్సార్‌ సీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వారిని పార్టీలోకి తీసుకురావడంలో కృషి చేసిన పార్టీ గ్రామ అధ్యక్షుడు సుంకర శ్రీనివాసరావు, కన్వీనర్‌ ముప్పా గౌతమిగోపిలను అభినందించారు. సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు.

ఇద్దరు ఎస్‌ఐలకు ఎస్పీ సత్కారం



ఎస్‌ఐలను సత్కరిస్తున్న ఎస్పీ తుషార్‌ డూడీ

నగరంపాలెం: ప్రజలకు నేరుగా సేవలు అందించడం పోలీస్‌ శాఖలోనే సాధ్యమని జిల్లా ఎస్పీ తుషార్‌ డూడీ అన్నారు. ఉద్యోగ విరమణ చేయనున్న ఎస్‌ఐలు శ్రీనివాసరావు (తాడేపల్లి పీఎస్‌), పి.సాంబశివరావు (ఏఆర్‌)లను శనివారం జిల్లా పోలీస్‌ కార్యాలయ ఆవరణలో ఆయన సత్కరించి, జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌ ఉద్యోగంలో చేరడం గొప్ప అదృష్టమన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని పేర్కొన్నారు. అన్ని వేళలా వారికి అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో ఏఆర్‌ ఏఎస్పీ హనుమంతు, ఆర్‌ఐలు శ్రీహరిరెడ్డి, బ్రహ్మానందం, డి.శ్రీనివాసరావు, స్వర్ణలత, పోలీస్‌ అసోసియేషన్‌ సభ్యులు మైలా సాంబశివరావు, హుస్సేన్‌, కరిముల్లా, లక్ష్మణ్‌, జానయ్య పాల్గొన్నారు.

14 సవర్ల బంగారం చోరీ

పెదకాకాని: గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి, 14 సవర్ల బంగారం ఆభరణాలు చోరీ చేసిన ఘటనపై కేసు నమోదైంది. వివరాల మేరకు.. మండలంలోని వెనిగండ్ల గ్రామానికి చెందిన చిరందాసు శివనాగేశ్వరమ్మ ఒక్కరే ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఉద్యోగ రీత్యా కుమారుడు, కోడలు గుంటూరులో ఉంటున్నారు. శివనాగేశ్వరమ్మ రోజూలానే శుక్రవారం.. ఇంటి వెనుక వాకిలి అరుగుపై కూర్చుని.. ఇంట్లోకి వెళ్లింది. రాత్రి 9:30 గంటల సమయంలో బీరువా తలుపులు తెరచి ఉండటాన్ని గుర్తించింది. అయితే ఈ విషయాన్ని శనివారం ఉదయం తన కుమారుడు చిరందాసు బాలసుబ్రహ్మణ్యంకు శివనాగేశ్వరమ్మ చెప్పింది. బీరువా తలుపులు రాత్రి ఎవరో తీసి ఉంచారని, ఏమైన వస్తువులున్నాయా అని అడిగింది. దీంతో అతను హడావుడిగా ఇంటికి చేరుకుని బీరువా పరిశీలించగా.. అందులో ఉన్న హారం, నెక్లెస్‌, బుట్టలు, చంపాశవర్లు, పాపిడి బిళ్లలు కనిపించలేదు. దీంతో పెదకాకాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసు సిబ్బంది క్లూస్‌ టీం ద్వారా ఘటన ప్రాంతంలో వేలిముద్రలు సేకరించి, వివరాలు నమోదు చేసుకున్నారు. చోరీకి గురైన బంగారు ఆభరణాల విలువ రూ.7 లక్షల వరకు ఉంటుందని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు శనివారం సీఐ కె.వీరాస్వామి తెలిపారు.

ఎన్నికల నియమావళి పటిష్టంగా అమలు చేయాలి

గుంటూరు జిల్లా జేసీ, ఈఆర్వో రాజకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో రాజకుమారి

మంగళగిరి: పోలింగ్‌ కేంద్రాల వద్ద ఎన్నికల నిబంధనలు పటిష్టంగా అమలు చేయాలని, నిర్లక్ష్యం వహించవద్దని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి, జాయింట్‌ కలెక్టర్‌ జె.రాజకుమారి తెలిపారు. నగరంలోని ఎంటీఎంసీ కార్యాలయంలో శనివారం 286 మంది బూత్‌ లెవల్‌ అధికారులు, 28 మంది సూపర్‌వైజర్లు, 25 మంది సెక్టార్‌ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయా అధికారులు సిబ్బంది నిరంతరం పోలింగ్‌ కేంద్రాలను పరిశీలిస్తూ నియమావళి అమలుపరచాలన్నారు. పోలింగ్‌ కేంద్రానికి 200 మీటర్ల లోపు తాత్కాలిక పార్టీల కార్యాలయాలు తెరవకుండా చూడాలని అనమతులు లేకుండా పార్టీ కార్యాలయాలు ప్రారంభిస్తే వెంటనే రిటర్నింగ్‌ అధికారికి సమాచారమివ్వాలన్నారు. ప్రతి బీఎల్‌ఓ, ఈఆర్‌ఓ, ఏఈఆర్‌ఓ, సెక్టార్‌ అధికారులు, పోలీస్‌ స్టేషన్‌ వివరాలు నిరంతరం అందుబాటులో ఉండాలని కోరారు. రాజకీయ పార్టీల సోషల్‌ మీడియా గ్రూపులలోను ఉండరాదన్నారు. ఓటర్ల తుది జాబితాపై సమగ్ర అవగాహన కలిగి 85 సంవత్సారాలు పైబడిన ఓటర్లు, గుర్తించిన దివ్యాంగుల వివరాలను ఆర్వోకు అందజేయలని కోరారు. ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఆర్‌ఓ ఎస్‌.ప్రకాశరావు, ఎంటీఎంసీ అసిస్టెంట్‌ కమిషనర్‌ బి.శివారెడ్డి పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి కోసం రన్‌ ఫర్‌ జీసస్‌



పట్టణంలోని వీధులలో రన్‌ ఫర్‌ జీసస్‌ ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

మంగళగిరి: ప్రపంచ శాంతి కోసం రన్‌ ఫర్‌ జీసస్‌ ర్యాలీ నిర్వహించినట్లు పాస్టర్స్‌ ఫెల్లోషిప్‌ ప్రతినిధులు తెలిపారు. పాస్టర్స్‌ ఫెల్లోషిప్‌ ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఆరు గంటలకు అంబేడ్కర్‌ విగ్రహం సెంటర్‌ వద్ద ర్యాలీని ప్రారంభించారు. పట్టణంలోని పురవీధులలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో క్రైస్తవులు, మహిళలు, చిన్నారులు భారీగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు తిమోతి, ఐ.జోషఫ్‌, వివేక్‌ బేతు, నల్లమోతు విజయరాజు, కలకోటి దేశాయ్‌, కేకే రవికుమార్‌, ఏవీఎస్‌ మణి, జి.రవికుమార్‌, జేమ్స్‌, జి.ప్రభుకుమార్‌, జె.సాల్మన్‌, జి.శ్యాంప్రసాద్‌, బాప్టిస్ట్‌ సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఫిరంగిపురంలో..

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని ఫిరంగిపురంలో పరిశుద్ధ శనివారాన్ని పురస్కరించుకొని మండల పాస్టర్స్‌ ఫెలోషిప్‌ ఆధ్వర్యంలో రన్‌ఫర్‌ జీసస్‌ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని మార్నింగ్‌ స్టార్‌ కళాశాల వద్ద నుంచి రేపూడి గ్రామం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మానవాళి రక్షించడం కోసం ఏసుక్రీస్తు జన్మించాడని చెప్పారు. మానవుల పాపాలను ప్రక్షాళన చేసేందుకు ఆయన శిలువపై మరణ శిక్షను భరించాడన్నారు.



తాడికొండలో రన్‌ఫర్‌ జీసస్‌ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పాస్టర్లు, భక్తులు

తాడికొండలో..

తాడికొండ: ప్రజల పాప పరిహారార్థం క్రీస్తు ఏసు ఇహలోక మరణం లోకానికి గొప్ప సందేశం అని పలువురు పాస్టర్లు పేర్కొన్నారు. ఈస్టరు పండుగను పురస్కరించుకొని మండల కేంద్రమైన తాడికొండలో శనివారం రన్‌ఫర్‌ జీసస్‌ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏసుతో నడుస్తాం, ఏసుతో జీవిస్తాం, ఏసుతో ప్రార్థిస్తాం అంటూ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్లు నాదెండ్ల యోహాను, ప్రసాదరావు, జక్రయ్య, శామ్యూల్‌, సంకూరు రాజు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో వేర్వురు చోట్ల చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా, శనివారం తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ ప్రతాప్‌ అందించిన వివరాలు.. చిర్రావూరులో నివాసముండే మెరికపల్లి కోటేశ్వరరావు(83) శనివారం ఉదయం సమయంలో టిఫిన్‌ చేసేందుకు రేపల్లె కనకదుర్గ వారధి కరకట్టపై ఉన్న ఓ హోటల్‌కు వస్తుండగా గంగానమ్మ గుడి ర్యాంప్‌ వద్ద రేపల్లె వైపు నుంచి కరకట్టకు వస్తున్న కారు ఢీకొట్టడంతో కోటేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డాడు. కోటేశ్వరరావును విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు సైదా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఏలూరుకు చెందిన లింగమనేని రమేష్‌బాబు(52) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ సాయిబాబా తెలిపారు. ఏలూరుకు చెందిన లింగమనేని రమేష్‌బాబు మార్చి 28వ తేదీ ద్విచక్ర వాహనంపై గుంటూరు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో ఎయిమ్స్‌ రోడ్‌ సమీపంలో స్పీడ్‌ బ్రేకర్‌ దాటుతూ ప్రమాదవశాత్తు వాహనంపై నుంచి కిందపడి తలకు తీవ్ర గాయమైంది. అప్పటి నుంచి తాడేపల్లిలోని ఓ కార్పొరేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఘటనపై మృతుడు రమేష్‌బాబు అన్నయ్య శ్రీహరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రాజ్యలక్ష్మి అమ్మవారికి సారె అందజేత



నృసింహస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారికి సారె అందజేసిన మహిళా భక్త బృందం

మంగళగిరి : నగరంలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి వారి ఆలయంలో వేంచేసి ఉన్న శ్రీ రాజ్యలక్ష్మి అమ్మ వారికి సారె అందజేశారు. రాజ్యలక్ష్మి అమ్మ వారి భక్త బృందం ఆధ్వర్యంలో మహిళా భక్తులు భారీగా పాల్గొని అమ్మ వారికి సారె సమర్పించారు. కార్యక్రమాన్ని ఆలయ ఈఓ ఏ రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.